TELTEL/2023/88710
# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
www.telanganamuchatlu.in
వరంగల్ సంపుటి : 3 సంచిక : 244 ఆదివారం 1 - 2 - 2026 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in








## మహా ఉప ముఖ్యమంత్రిగా
# సునేత్రా పవార్ ప్రమాణం

- శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నిక
- కార్యక్రమానికి దూరంగా శరద్ పవార్, సుప్రియా సూలె
- అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ

తెలంగాణ ముచ్చట్లు

ముంబై, జనవరి 31 : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ, దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా శనివారంనాడు ప్రమాణస్వీకారం చేశారు. ముంబైలోని లోక్‌భవన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమె చేత ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మరో ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మహాయుతి మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎన్‌సీపీ నేతలు శరద్ పవార్, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో రాష్ట్రంలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం పగ్గాలను సునేత్ర చేపట్టారు. విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపీ అయిన ఆమె శనివారం ఉదయం ముంబైలోని విధాన్ భవన్‌కు చేరుకున్నారు.

2 లో

## గెలుపు గుర్రాలకే
# కాంగ్రెస్ టిక్కెట్లు

- స్థానికంగా గెలిచే వారికే పార్టీ అండ
- రెబల్స్ బెడద లేకుండా చూసుకోండి
- కాంగ్రెస్ నేతలకు సూచించిన సిఎం రేవంత్



తెలంగాణ ముచ్చట్లు

హైదరాబాద్, జనవరి 31 : మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నేతలను కోరారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు. భాజపా, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే. రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి' అని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికల సర్వే నివేదికలను టీపీసీసీ చీఫ్ సీఎంకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ 90 శాతం స్థానాలను కైవసం చేసుకోవాలని రేవంత్ రెడ్డి టార్గెట్ నిర్దేశించారు. రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. ఫిబ్రవరి 3 నుంచి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో జీహెచ్ఎంసీకి మినహాయింపునిచ్చారు. మొత్తం 2,996 వార్డులకు పోటీ జరగనుంది. ఈనెల 28 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. శనివారం నాడు నామినేషన్ల పరిశీలన జరుగనుంది. ఫిబ్రవరి మూడున నామినేషన్ల ఉ

2 లో

## కెసిఆర్ లేని ఇంటికి నోటీస్
# ఎలా అంటిస్తారు



- పోలీసుల అత్యుత్సాహం ఎవరి కోసం
- తెలంగాణ తెచ్చిన పెద్దాయననే అవమానిస్తారా
- ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

తెలంగాణ ముచ్చట్లు

హైదరాబాద్, జనవరి 31 : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ రెండోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసును నందినగర్‌లోని ఆయన నివాసం గోడకు అతికించడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. తెలంగాణ సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? కేసీఆర్ స్వయంగా తానుంటున్న నివాసం చిరునామాతో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా.. ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణం. ఇది అహంకారం

2 లో

## బడ్జెట్‌లో తెలంగాణకు
# న్యాయం జరగాలి

- గతంలో లాగా కాకుండా కేటాయింపులు పెరగాలి
- అన్యయాం జరిగితే బిజెపి ఎంపిలదే బాధ్యత
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ ముచ్చట్లు

హైదరాబాద్, జనవరి 31 : కేంద్ర ప్రభుత్వం నేడు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తెలంగాణను నిర్లక్ష్యం చేయొద్దనిమంత్రిపొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానికి వివక్ష ఉందన్నారు. దానిని సరిదిద్ది కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. తెలంగాణపై బడ్జెట్‌లో వివక్షత చూపిస్తే బీజేపీ ఎంపీలే బాధ్యత వహించాలని చెప్పారు. శనివారం గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు.

2 లో

## సిట్ నోటీసులపై
# కెసిఆర్ సమాలోచనలు

- కెటిఆర్, హరీష్ రావులతో పాటు న్యాయనిపుణల సలహాలు
- సిట్ విచారణకు హాజరుపై తొలగని ప్రతిష్టంభన


తెలంగాణ ముచ్చట్లు

గజ్వేల్, జనవరి 31 : ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ జారీ చేసిన నోటీసులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. నేతలు, న్యాయవాదులతో ఎర్రవల్లిలో సమాలోచనలు చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు శుక్రవారం నుంచి ఎర్రవల్లిలోనే ఉన్నారు. ఆదివారం నాటి సిట్ విచారణ అంశంపై చర్చిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో తాను ఉంటున్న ఇంటికే వచ్చి విచారించాలన్న కేసీఆర్ విజ్ఞప్తిని సిట్ తోసిపుచ్చిన విషయం తెలిసిందే. అక్కడకు రాలేమని చెబుతూ హైదరాబాద్‌లోనే విచారణకు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో విచారణకు అందుబాటులో ఉండాలని పేర్కొంది. దీంతో ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద హడావుడి నెలకొంది. సిట్ నోటీసులపై మాజీ సీఎం కేసీఆర్ సమాలోచనలు జరుపుతున్నారు. నందినగర్ నివాసంలో సిట్ విచారణకు కేసీఆర్ హాజరవుతారా లేదా అన్న దానిపై సస్పెన్స్ కొనసాగుతుంది. ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో తనని విచారించవచ్చన్న విజ్ఞప్తిని తిరస్కరించి నందినగర్ కే రావాలని సిట్

2 లో

## కరీంనగర్
# మేయర్ సీటు మాదే

– కేంద్రమంత్రి బండి సంజయ్ ధీమా



తెలంగాణ ముచ్చట్లు

కరీంనగర్, జనవరి 31: కరీంనగర్ మేయర్‌తో పాటు మూడు చైర్మన్ పీఠాలు తమవేనని బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం,కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంచార్జ్‌లు, కన్వీనర్లు, కో కన్వీనర్లు సమావేశంలో బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడమే మా లక్ష్యం. గెలిచే చోట

2 లో

## సుప్రీం మార్గదర్శకాలు
# ఉల్లంఘించిన పోలీసులు



- నందినగర్ ఇంటికి నోటీసులు ఎలా అతికిస్తారు
- జూబ్లీహిల్స్ ఎసిపికి మాజీ సిఎం కెసిఆర్ లేఖ
- నేటి విచారణకు అందుబాటులో ఉంటానని వెల్లడి

తెలంగాణ ముచ్చట్లు

హైదరాబాద్, జనవరి 31 : జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని మాజీ సిఎం కేసీఆర్ పేర్కొన్నారు. నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఆరు పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. క్రైమ్ నంబర్ 243/2024 విచారణకు సంబంధించి తన

2 లో

# గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

- పుష్కరఘాట్లు, రహదారుల విస్తరణపై దృష్టి
- విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్ష



తెలంగాణ ముచ్చట్లు

హైదరాబాద్, జనవరి 31 : వచ్చే సంవత్సరం జరిగే గోదావారి పుష్కరాలకు పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. గోదావారి నది తీరంలో దాదాపు 69 ప్రాంతాలలో 74 పుష్కర ఘాట్లను గుర్తించామని అధికారులు తెలిపారు. త్వరితగతిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి తగు ప్రతిపాదనలు సమర్పించాలని

2 లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక



# ఎప్రిల్ కల్లా అయోధ్య ఆలయం పూర్తి

## – నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా

తెలంగాణ ముచ్చట్లు

అయోధ్య, జనవరి 31 : ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని రామాలయ నిర్మాణ పనులన్నీ ఏప్రిల్ 30వ తేదీతో పూర్తికానున్నట్టు రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మార్చి 19న అయోధ్యలో పర్యటించనున్నారని, ఇందుకు రాష్ట్రపతి తమ సమ్మతి తెలిపారని చెప్పారు. రూ.1,900 కోట్ల అంచనా వ్యయంతో రామాలయ నిర్మాణం పనులు సాగుతున్నాయి. రామాలయ నిర్మాణ కమిటీతో రెండ్రోజుల పాటు సమావేశమైన అనంతరం నృపేంద్ర మిశ్రా మీడియాతో మాట్లాడుతూ, ఆలయ నిర్మాణ పనులకు ఎల్ అండ్ టీ, టాటా కన్సల్టెన్సీలతో మూడేళ్ల కాలానికి ఒప్పందం చేసుకున్నామని, ఏప్రిల్ 30వ తేదీకి నాటికి పనులు పూర్తి అవుతాయని చెప్పారు. ఆ రోజుకు అన్ని పేపర్ వర్క్‌లతో పాటు బిల్ పేమెంట్ ప్రొసీజర్లు కూడా పూర్తి చేస్తామని చెప్పారు. దాంతో ఆలయం శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ పరిధిలోకి వస్తుందని తెలిపారు.

# కరీంనగర్ మేయర్ సీటు మాదే

మొదటిపేజీ తరువాయి

కార్యకర్తలకే సీట్లు ఇస్తున్నాం. గెలిచే అవకాశం లేనిచోట మాత్రమే ప్రత్యామ్నాయ నేతలకు టిక్కెట్లుటిక్కెట్ రాని వారికి నామినేటెడ్, పార్టీ పదవులతో న్యాయం చేస్తాం. తొందరపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. తప్పుడు ప్రచారాలు నమ్మకండి. డివిజన్లలో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీని గెలిపించండి' అని పిలుపునిచ్చారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలి

మొదటిపేజీ తరువాయి

ఈ పౌర్ణమి తెలంగాణకు వెలుగులు తెస్తుందా..? , చీకటి ఇస్తుందా..? చూడాలని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిసారీ తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకత ఉందన్నారు. రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన వంటి తెలంగాణ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ విషయంపై కేంద్రానికి, బీజేపీకి చివరిసారిగా గుర్తు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాసంస్థల స్థాపనకు మోదీ ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు తెలంగాణకి వస్తే తాము గౌరవంగా కలుస్తున్నామని ప్రస్తావించారు. పక్క రాష్ట్రాలకి నిధులు కేటాయిస్తే తాము తప్పు పట్టడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టిక్కెట్లు

మొదటిపేజీ తరువాయి

పసంహరణకు చివరి తేదీ. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన వచ్చాక పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించి మున్సిపల్ ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఆపై ఫిబ్రవరి 3 నుంచి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్న సీఎం.. పలు జిల్లాల్లో నిర్వహించే ప్రచార సభల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి

అక్కడ ఎన్సీపీ ఎమ్మెల్యేలతో సునేత్రా పవార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్యాంగం ప్రకారం శాసన సభ లేదా శాసన మండలికి ఎన్నిక కాని వ్యక్తి కూడా మంత్రి పదవి చేపట్టవచ్చు. అయితే ఆ వ్యక్తి ఆరు నెలల్లోగా శాసనసభ సభలేదా శాసనమండలి సభ్యుడిగా ఎన్నికవ్వాలి. దీనికి ముందు, శనివారం ఉదయం ఎన్సీపీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లెజిస్లేటివ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో సునేత్ర పేరును ఎమ్మెల్యే దిలీప్ వాల్సే పాటిల్ ప్రతిపాదించగా, ఎన్సీపీ మంత్రి ఛగన్ భుజ్‌బల్ బలపచారు. అనంతరం ఏకగ్రీవంగా పార్టీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర ఎన్నికయ్యారు. సునేత్ర పవార్ డిప్యూటీ సీఎం పదవితో చేపట్టంతో అజిత్ పవార్ చేపట్టిన శాఖలను కూడా ఆమెకు అప్పగించనున్నారని తెలుస్తోంది. అయితే అజిత్ పవార్ చేతిలోని ఆర్థిక శాఖను మాత్రం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తన వద్దే ఉంచుకోనున్నారని, దీనికి బదులుగా మరో శాఖను ఆమెకు అప్పగిస్తారని తెలుస్తోంది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సునేత్ర పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, దివంగత అజిత్‌దాదా పవార్ కలలను సాకారం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తారనే నమ్మకం తనుకుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# చర్లపల్లి వద్ద విషాద ఘటన

మొదటిపేజీ తరువాయి

ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్నట్టుగా రైల్వే పోలీసులు గుర్తించారు. మృతులు బోడుప్పల్ హరితహారం కాలనీకి చెందిన పిన్నింటి విజయశాంతి రెడ్డి, విశాల్ రెడ్డి, చైతన్య రెడ్డిగా తెలుస్తోంది. గూడ్స్ రైలు లోకో పైలట్ సమాచారంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.సమాచారం అందిన వెంటనే రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని.. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుల వద్ద రైల్వే టికెట్లు, విలువైన వస్తువులు లేవని జీఆర్‌పీ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎర్రచందనం స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్ అరెస్ట్

## – వివరాలు వెల్లడించిన ఎస్పీ

తెలంగాణ ముచ్చట్లు

తిరుపతి, జనవరి 31 : కర్ణాటక రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్‌ను ఏపీ ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. పాత కేసుల్లో పరారీలో ఉన్న స్మగ్లర్లను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఇందులో భాగంగానే ఎప్పటి నుంచో పరారీలో ఉన్న మొహమ్మద్ ముజామిల్‌ను పక్కా ప్రణాళిక ప్రకారం అదుపులోకి తీసుకున్నామన్నారు. శనివారం తిరుపతి రూరల్ మండలం, చిత్తూరు – నాయుడుపేట రోడ్డు తనపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేశాం.తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ కులశేఖర్ శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో టాస్క్‌ఫోర్స్ కఠిన చర్యలను చేపట్టింది. అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నాం. మరో వైపు జాతీయ, అంతర్జాతీయ స్మగ్లర్లపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఎర్రచందనం దుంగలను చైనాకు ఎగుమతి చేస్తూ, అదే ముసుగులో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తున్నాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎర్రచందనం స్మగ్లర్లు సయ్యద్ అబ్దుల్ లతీఫ్ అలియాస్ సెట్టు, సేటుభాయ్, వాజీబ్‌తో అతడికి పరిచయం ఉంది. బెంగళూరుకు చెందిన రవి ద్వారా ఎర్రచందనం దుంగలు తక్కువ ధరకే కొనేవాడు. ఆ ఎర్రచందనం దుంగలను రైతుల వద్ద కొన్నట్టుగా ప్రభుత్వ అనుమతులు తీసుకొని, వాటిని చైనాకు అక్రమంగా రవాణా చేసి అధిక లాభాలు ఆర్జించేవాడు' అని విచారణలో తేలిందని టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు తెలిపారు.

# గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

అధికారులను సి.ఎస్ ఆదేశించారు. విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ఈ రోజు రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీస్ లు, రవాణా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉన్నతాధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధి, సౌకర్యాల కల్పన, పరిపాలన వ్యవస్థ పై సమీక్షించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్రంలోని ఇతర ప్రముఖ దేవాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందిస్తున్న వసతులు, భద్రత, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ, రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట, వేములవాడ, భక్తుల రద్దీ ఉండే ఇతర ఆలయాల్లో దర్శన క్యూల నిర్వహణ, పార్కింగ్, త్రాగునీరు, టాయిలేట్స్, పరిసరాల పరిశుభ్రత నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేనేత కళాకారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలని సూచించారు. రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షా సమావేశంలో భూ భారతి రికార్డుల నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవలు, భూ సర్వేలు, సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయ భవనాల నిర్మాణం, ఇ-ఫైలింగ్, లైసెన్స్డ్ సర్వేయర్లు, 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యసాధన, తదితర అంశాలపై సమీక్షించారు. క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సెట్విన్, రాష్ట్ర మ్యూజియమ్స్ అభివృద్ధి, ఆయా శాఖల పనితీరుపై సి.ఎస్ సమీక్షించారు. ప్రస్తుత కార్యక్రమాల అమలు స్థితి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల, తెలంగాణ 2047 విజన్ లక్ష్య సాధన పై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో రాబోయే 2036 ఒలింపిక్స్ నాటికి రాష్ట్రంలో అంతర్జాతీయ క్రీడాకారులను అధిక సంఖ్యలో తయారు చేసే విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ విధంగా క్రీడల అభివృద్ధికి యువతను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల వైపు మరింత ఆకర్షించే విధంగా విధానాలను రూపొందించాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. యువజన సర్వీసులు శాఖ ద్వారా అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ శిక్షణ, యువత సంక్షేమ కార్యక్రమాలు లక్ష్య సాధనలో ఉండేలా పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, కోచింగ్ సదుపాయాలు, ప్రోత్సాహకాలు, అవార్డులు, ఆర్థిక సహాయంపై సమీక్ష జరిపి ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా సీఎం కప్ వాట్సాప్ యాప్ ను ఆవిష్కరించారు. పర్యాటక రంగంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించాలని అన్నారు. రవాణా, రోడ్లు భవనాలు శాఖ సమావేశంలో రాష్ట్ర రహదారుల నిర్మాణం, నిర్వహణ, ప్రభుత్వ భవనాల నిర్మాణ పురోగతి, నాణ్యత ప్రమాణాలు, ప్రజలకు అందిస్తున్న సేవల సామర్థ్యం తదితర అంశాలపై ప్రధాన కార్యదర్శి సమగ్రంగా సమీక్షించారు. రహదారుల అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి కీలకమని, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అనుసంధానించే రహదారుల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో చేపట్టిన పలు ప్రభుత్వ ఆసుపత్రులు వరంగల్, ఎల్.బి.నగర్, ఆల్వాల్, సనత్ నగర్, న్యూ ఉస్మానియా, హైకోర్టు నూతన భవనం, భవన నిర్మాణ పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలని, వాహనాల నమోదు, డ్రైవింగ్ లైసెన్సులు, రహదారి భద్రత చర్యల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, సెర్ప్, మిషన్ భగీరథ శాఖల పనితీరు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, గ్రామ పంచాయతీల పనితీరు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం అమలు పురోగతి, గ్రామీణ రహదారుల అభివృద్ధి, మహిళ సంఘాల బ్యాంక్ లింకేజ్, తదితర అంశాలపై సి.ఎస్ సమీక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. పథకాల అమలులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పారదర్శకతను పాటించాలని అన్నారు. గ్రామాల్లో రానున్న వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, ముఖ్యకార్యదర్శులు శైలజా రామయ్యర్, సందీప్ కుమార్ సుల్తానియా, ఎన్. శ్రీధర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తీ, సెర్ప్ సీఈఓ దివ్య, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ శృతి ఓఝా, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హన్మంతు, దేవాదాయశాఖ డైరెక్టర్ ఎస్. హరీష్, డైరెక్టర్ స్పోర్ట్స్ సోనిబాలా దేవి, డైరెక్టర్ కల్చర్ నరసింహారెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్ లు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు

మొదటిపేజీ తరువాయి

వివరణను ఈ లేఖలో వివరించారు. ముఖ్యంగా నందినగర్ నివాసం గోడపై నోటీసు అతికించడంపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా నోటీసులు అతికించడం రాజ్యాంగ విరుద్ధమని కేసీఆర్ స్పష్టం చేశారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను.. వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని గుర్తు చేశారు. తాను ప్రస్తుతం ఎర్రవల్లి నివాసంలో ఉంటున్నానని, అక్కడే విచారణ జరపాలని పోలీసులకు స్పష్టంగా తెలిపారు. ఈ సందర్భంగా సతేందర్ కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసు తీర్పును లేఖలో ఉటంకించారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న చిరునామాకు, సీఆర్పీసీ సెక్షన్ 160 కింద జారీ చేసే నోటీసులకు ఎలాంటి సంబంధం లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నివసిస్తున్న చిరునామాలోనే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం స్పష్టంగా చెబుతోందని తెలిపారు. హరీష్ రావుకు జారీ చేసిన నోటీసుల విషయంలో పోలీసులు వేర్వేరు ప్రమాణాలు పాటిస్తున్నారని కేసీఆర్ విమర్శించారు. ఈ తరహా చర్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని హెచ్చరించారు. పోలీసుల తీరు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతాయుతమైన పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తి సహకారం అందిస్తానని కేసీఆర్ వెల్లడించారు. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నందినగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అక్రమ పద్ధతిలో జారీ చేసిన నోటీసులను విస్మరించే హక్కు తనకు ఉందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో తనకు సంబంధించిన నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచించారు. అలాగే ఏపీ హైకోర్టులోని వీడీ మూర్తి కేసు తీర్పును కూడా లేఖలో ప్రస్తావించారు. చట్టపరమైన అభ్యంతరాలున్నా తాను విచారణలో సిట్‌కు సహకరిస్తానని చెప్పారు. సిట్ పోలీసుల వైఖరి కోర్టు ధిక్కారం కిందకే వస్తుందని తెలిపారు. పోలీసుల తీరు నా వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందని వెల్లడించారు. కేసీఆర్ లేఖలో ఏం రాశారంటే.. 'సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకి వ్యతిరేకం. సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కిన సిట్ అధికారుల తీరు. సిట్ అధికారులకి నోటీసు ఇచ్చే అధికారమే లేదు. ఇది నా రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. మొన్న రెండుసార్లు సిట్ అధికారులు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధం, చట్టాలను అతిక్రమించి ఇచ్చారు. మీరు ఇచ్చిన మొదటి నోటీసుకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంవల్ల వేరే రోజు విచారణకు తేదీ ఇవ్వాలని చెప్పాను. దాంతోపాటు 65 ఏళ్ల పైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సెక్షన్ 160 అసఖఅ నిబంధనలను మీ దృష్టికి తెచ్చాను' అని పేర్కొన్నారు. 'తదుపరి నోటీసులన్నీ కూడా ఎర్రవల్లిలోని నా నివాసానికే పంపాలని చెప్పాను. కానీ, ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి 9 గంటలకు నందినగర్ నివాసంలోని మా ఇంటి గోడకు అతికించినట్లు తెలుస్తోంది. ఆ లేఖ మీరే పంపినట్లయితే, మీ సూచనల మేరకే అతికించినట్లయితే, ఆ లేఖను తీవ్రంగా ఆక్షేపిస్తున్నాను. ఇది భారత రాజ్యాంగం, చట్టం, గౌరవ సుప్రీంకోర్టుల పట్ల మీకు ఏమాత్రం గౌరవం లేదు అనే విషయాన్ని సూచిస్తుంది. గతంలో సుప్రీంకోర్టు 'సతేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ' అనే కేసులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశిరచిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది' అని కేసీఆర్ తన లేఖలో సూచించారు. 'భవిష్యత్తు నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని చెప్పినప్పటికీ మీరు దాన్ని విస్మరించారు. కాబట్టి మీరు ఇచ్చిన రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదు, అది చెల్లదు. మీరు ఇచ్చిన నోటీసు నా రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘించడమే.

# కెసిఆర్‌కు నోటీసుల పేరుతో వేధింపులు

## – నేడు తెలంగాణలో నిరసనలకు కెటిఆర్ పిలుపు

తెలంగాణ ముచ్చట్లు

హైదరాబాద్, జనవరి 31 : సిట్ విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా కేసీఆర్‌ను వేధిస్తున్నందుకు నిరసనగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు నేతలు నిరసన ప్రదర్శనలు చేయాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్రమంతటా శాంతియుతంగా ఆందోళనలకు దిగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 12 వేలకుపైగా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని సూచించారు. నిరసనల్లో భాగంగా ప్రతి మున్సిపల్, నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీలు నిర్వహించనున్నాయి. నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారు. ధర్నాలు, రాస్తారోకోల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయనున్నారు. మాజీ మంత్రులు, సీనియర్ నేతలు, పార్టీ శ్రేణులు ఆందోళనల్లో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. నిరసనలు శాంతియుతంగా చేయాలని, పోలీసులతో ఘర్షణలు వద్దని సూచించారు.

# బిల్‌గేట్స్‌కు సెక్స్ వ్యాధులు

## – రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు
## – ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం వెల్లడి
## – తీవ్రంగా ఖండించిన బిల్‌గేట్స్ బృందం

తెలంగాణ ముచ్చట్లు

న్యూయార్క్,జనవరి 31 : మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించి ఓ సంచలన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. రష్యన్ అమ్మాయిలతో బిల్‌గేట్స్‌కు లైంగిక సంబంధాలు ఉన్నాయని, అందువల్లే ఆయన సుఖ వ్యాధుల బారిన పడ్డారనే ఆరోపణ బయటకు వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తోన్న ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం విచారణకు సంబంధించి 30 లక్షల పేజీలను అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. 2013లో తనకు తాను రాసుకున్న ఈ-మెయిల్‌లో ఎప్‌స్టీన్ ఈ విషయాన్ని ప్రస్తావించినట్టు సమాచారం. రష్యా అమ్మాయిలతో గేట్స్ శృంగార సంబంధాలు సాగించారని, ఫలితంగా ఆయన లైంగిక వ్యాధుల బారిన పడ్డారని ఎప్‌స్టీన్ పేర్కొన్నారు. ఆ విషయం బయట పడకుండా ఉండడం కోసం తన భార్య మిలిందాకు గేట్స్ రహస్యంగా యాంటీబయాటిక్స్ ఇవ్వాలనుకున్నారని, తనను ఆ మాత్రలు అడిగారని ఎప్‌స్టీన్ తెలిపారు. ఆ తర్వాత తనతో స్నేహాన్ని గేట్స్ తెంచుకున్నారని కూడా అదే మెయిల్‌లో ఎప్‌స్టీన్ పేర్కొన్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని ఆరోపణలను గేట్స్ బృందం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా అసంబద్ధమైనవని, తనతో స్నేహం కొనసాగించకపోవడం వల్లే ఎప్‌స్టీన్ నిరాధార ఆరోపణలు చేశారని పేర్కొంది. అంతేకాదు, టెస్లా అధినేత ఎలన్ మస్క్‌కు సంబంధించిన అంశాలు కూడా ఎప్‌స్టీన్ ÷ల్స్‌లో ఉన్నాయి. వర్జిన్ దీవులలోని తన ఐల్యాండ్‌ను సందర్శించాలని తాను మస్క్‌ను ఆహ్వానించానని, అయితే తన ఆహ్వానాన్ని మస్క్ పలుసార్లు తిరస్కరించారని కూడా ఎప్‌స్టీన్ పేర్కొన్నారు.

# సిట్ నోటీసులపై కెసిఆర్ సమాలోచనలు

మొదటిపేజీ తరువాయి

అధికారులు అంటున్నారు. సిట్ నోటీసులపై న్యాయ నిపుణుల సలహా తీసుకున్న అనంతరం కేసీఆర్ తీసుకుబోయే నిర్ణయంపై ఉత్కంఠ చెలరేగుతుంది. .అయితే ఇప్పటికే మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డిలతో గులబీ బాస్ కేసీఆర్ సమావేశం అయ్యారు. ఫామ్ హౌస్ లోనే కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావులు ఉన్నారు. నేడు మరోసారి బిఆర్ఎస్ కీలక నేతలతో కెసిఆర్ సమావేశం సమావేశం అయ్యారు. మరోవైపు ఫామ్ హౌస్ లో బీఆర్ఎస్ పార్టీలో చేరికల ప్రోగ్రాం కొనసాగుతుంది. కేటీఆర్ సమక్షంలో నాగార్జున సాగర్ నియోజకవర్గ బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పార్టీ కండువా కప్పుకోనున్నారు.

# కెసిఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు

మొదటిపేజీ తరువాయి

కాకపోతే మరేమిటి! 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలన్న నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు సిట్ అధికారులు నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గేటుకు నోటీసులు అంటించి.. పైశాచిక ఆనందం పొందడం దారుణం' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# రాజకీయ కక్ష సాధింపు తో కేసీఆర్ కు నోటీసులు

## -మాజీ ఎంపీ నామ



ఖమ్మం బ్యూరో, జనవరి31(తెలంగాణ ముచ్చట్లు) : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)కు మరోసారి నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపు లో భాగంగానే సిట్ పేరుతో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం వరుసగా నోటీసులు జారీ చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ విచారణకు సహకరించబోనని ఎక్కడా చెప్పలేదని, కేసీఆర్ చట్టాన్ని గౌరవించే నాయకుడని, విచారణ కు పూర్తిగా సహకరిస్తానని చెప్పారని, తాను నివాసం ఉంటున్న ఎర్రవల్లి లో విచారణ జరపాలని కోరారని అయితే ఏకపక్షంగా తిరస్కరించారని విమర్శించారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల సమయం లో ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు ఇలాంటి వ్యవహారాలు చేస్తున్నారని, తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని, ఇలాంటి చర్యలతో బీఆర్ఎస్ పార్టీని గానీ, కేసీఆర్ ను గానీ బలహీనపర్చలేరని నామ ధీమా వ్యక్తం చేశారు. చట్టపరంగా ఎదుర్కొంటూనే, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# డాక్టర్ పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు గద్దర్ స్ఫూర్తి అవార్డు




ఖమ్మం బ్యూరో, జనవరి 31(తెలంగాణ ముచ్చట్లు) : ప్రజాయుద్ధనౌక, విప్లవ కవి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గద్దర్ జయంతిని పురస్కరించుకొని తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని నందమూరి తారక రామారావు కళామందిరంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమంలో తన గళంతో ప్రజలను చైతన్యపరిచిన ప్రముఖ సామాజిక కార్యకర్త జానపద గాయకురాలు డాక్టర్ పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు గద్దర్ స్ఫూర్తి అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్, ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్, పుడమిక్ సాహితీ వేదిక సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతిని ఘనంగా జరుపుకోవడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ అవార్డును గద్దర్ ముద్దుల కుమార్తె, ప్రముఖ డాక్టర్ జీవీ వెన్నెల గద్దర్ అందజేశారు. విశిష్ట అతిథిగా డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి, మాజీ కేంద్ర మంత్రి హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్, తెలంగాణ సాంస్కృతిక సారథి పాల్గొన్నారు. ఆత్మీయ అతిథిగా రొయ్యూరు శేష సాయి, ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపకులు హాజరయ్యారు. సభాధ్యక్షులుగా పుడమి సాహితీ వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ చిలుముళ బాల్ రెడ్డి వ్యవహరించారు. ప్రత్యేక అతిథులుగా శ్రీధరావత్ బాల్సర్ నాయక్, యామినేని ఉప్పల్ రావు, మిర్యాల వెంకట్రావు పాల్గొని కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా తీర్చిదిద్దారు. సాహిత్యం, సంస్కృతి, సామాజిక సేవ రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న పలువురు ప్రముఖులను గుర్తించి గద్దర్ స్ఫూర్తి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాటి లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ గద్దర్ స్ఫూర్తితో ఇచ్చిన ఈ అవార్డు అందుకోవడం నాకు ఎంతో గర్వంగా ఉంది. ప్రజల కోసం నాసేవలను మరింత అంకితభావంతో కొనసాగిస్తాను అని ఆనందం వ్యక్తం చేశారు.

# విశిష్ట సేవారత్న పురస్కారం అందుకున్న గండి వెంకన్న గౌడ్.




ఖమ్మం బ్యూరో,జనవరి 31(తెలంగాణ ముచ్చట్లు) :భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో అటవీ శాఖ లో వివిధ హోదాలలో విశేషమైన సేవలందించి, పదవీ విరమణ పొందినప్పటికీ సేవాదృక్పదంతో, భద్రాచలం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు గా పనిచేస్తూ, సమాజ సేవకే నిరంతరం కృషి చేస్తున్న నిత్య కృషి వలుడు, నిబద్దత కలిగిన మన గౌడ్ ముద్దుబిడ్డ, ఏజెన్సీ గౌడ్ సంఘం నాయకులు, పెద్దలు గండి వెంకన్న గౌడ్ సేవలను గుర్తించి, తెలుగుకళా రత్నాలు సంస్కృతిక సేవా సంస్థ అండ్ ఉషోదయ ఫౌండేషన్ వారు, విశిష్ట సేవారత్న పురస్కారం ను ఇచ్చి ఘనంగా సత్కరించిన, ఈ శుభ సందర్భంగా వెంకన్న గౌడ్, ఇంకా మరెన్నో పురాష్కా రాలను అందుకోవాలని కోరుకుంటూ, భద్రాది జిల్లా ఏజెన్సీ గౌడ్ సంఘం తరపున శుభాకాంక్షలు తెలియజేసారు.

# శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో శని త్రయోదశి ప్రత్యేక పూజలు



ఎల్కతుర్తి, జనవరి 31 (తెలంగాణ ముచ్చట్లు):హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్లభాపురం గ్రామంలో ఉన్న శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో శని త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పంచామృత రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించగా, శ్రీ శనీశ్వర స్వామికి తైలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు, దూప దీప నైవేద్య సంఘం ఎల్కతుర్తి మండల అధ్యక్షులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంజి భావనఋషి, శ్రవణ్ రావ్, రవీందర్, మహిపాల్, విజయ, మమతతో పాటు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# ధన్యజీవి ఏపూరి సీతయ్య

## - సీపీఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని







ఖమ్మం బ్యూరో,జనవరి 31(తెలంగాణ ముచ్చట్లు) :సీపీఐ సీనియర్ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుడు నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి సీతయ్య ధన్యజీవి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి సీతయ్య (90) బుధవారం అనారోగ్యంతో మరణించిన విషయం విదితమే. ఆయన మరణవార్త తెలుసుకున్న కూనంనేని శుక్రవారం నాగిలిగొండ లోని ఆయన నివాసానికి వెళ్లి సీతయ్య, మృతదేహంపై పార్టీ జెండా ఉంచి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సీతయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్ గా పనిచేశారని, బ్రతికినంతకాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు. ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి సీతయ్య పాత్ర ఎనలేనిదన్నారు. సీతయ్య కుటుంబం కూడా తండ్రి బాటలోనే నడుస్తుందన్నారు. సీతయ్య కుమారుడు రవీంద్రబాబు జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తున్నాడన్నారు. సీతయ్య కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండవర్తి గోవిందరావు, ఎర్రా బాబు దొండపాటి రమేష్, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, ఏనుగు గాంధీ, పావులూరి మల్లిఖార్జునరావు, కూచివుండి రవి. ఏనుగు వెంకటేశ్వరరావు. పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్ జిలా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్ రావు, తాటి నిర్మల, కన్నెబోయిన విజయమ్మ, ఏసు, నేరడ, బస్వాపురం సర్పంచులు దూసరీ నేతాజీ, ఆవుల నర్సింహారావు, సిపిఐ నాయకులు తాళ్లూరి యాదగిరి, తాళ్లూరి పుల్లయ్య, బొడ్డు కొండలరావు, నక్కనబోయిన కృష్ణ నారపోగు నాగార్జున నాగిలిగొండ శాఖ కార్యదర్శి చాట్ల రమేష్ , బాబు, ముఖర్జీ, షేక్ చిన్న జాన్, షేక్ హుస్సేన్, ఏపూరి నర్సయ్య తదితరులు నివాళులర్పించారు.

**వలు పార్టీనాయకుల నివాళి..**

సీతయ్య మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, మడుపల్లి భాస్కర్, పెంట్యాల అప్పారావు, పెంట్యాల పుల్లయ్య. మాజీ ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ఆలస్యం బసవయ్య, కాంద్ర పిచ్చయ్య, టీడీపీ మండలఅధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీను, బారాన మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, మంకెన రమేష్, వేముల నర్సయ్య, వంకాయలపాటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ చాట్ల సురేష్, గడ్డం శ్రీను, సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, నాయకులు కొంద్రు జానకిరామయ్య, ఓబెనబోయిన వీరబాబు, మద్దిని బసవయ్య తదితరులు నివాళులర్పించారు.

# సత్తుపల్లిలో వ్యక్తి గల్లంతు.!

## - తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు



సత్తుపల్లి, జనవరి 31 (తెలంగాణ ముచ్చట్లు):సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీ రోడ్ నెం. 6లో నివాసం ఉంటున్న కొలికపోగు కిషోర్ (30) శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. మధ్యాహ్నం సమయంలో అతని తల్లి సమీపంలోని గుడికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి కుమారుడు ఇంట్లో లేకపోవడం గమనించారు. పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఆమె సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గల్లంతైన వ్యక్తికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

సంప్రదించవలసిన నంబర్లు:
ఇన్‌స్పెక్టర్ టి.శ్రీహరి: 8712659167
ఎస్ఐ పి.ప్రదీప్: 8712572065
సత్తుపల్లి పోలీస్ స్టేషన్: 8712659168

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా 4వ వార్డులో ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రచారం



వనపర్తి,జనవరి31(తెలంగాణ ముచ్చట్లు): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం వనపర్తి పట్టణం నాలుగో వార్డులో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మార్నింగ్ వాక్ చేపట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి శరవందకు మద్దతుగా వార్డులోని వీధుల గుండా పర్యటిస్తూ ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి శరవందను కౌన్సిలర్‌గా గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. నాలుగో వార్డులో శివాలయం అభివృద్ధి కోసం రూ. 50 లక్షల రూపాయలు మంజూరు చేశామని, అలాగే బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 8 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా రూ. 85 లక్షలతో 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ట్యాంకును నిర్మించి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రూ. 40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని, మరో రూ. 60 లక్షల రూపాయలతో త్వరలోనే సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వనపర్తి పట్టణం పూర్తిస్థాయిలో నిర్లక్ష్యానికి గురైందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్తు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రైతులకు బోనస్, రైతు భరోసా, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, పార్టీ నాయకులు పరశురాములు, చంద్రశేఖర్ రెడ్డి, లక్కాకుల సతీష్, ఎస్ఎల్ఎన్ రమేష్, బ్రహ్మం చారి, పాకనాటి కృష్ణయ్య, ఎల్ఐసి కృష్ణ, బొంబాయి మన్నెంకొండతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ మీట్ తో విద్యార్థుల్లో నూతన ఉత్తేజం పెంపొందుతుంది

--మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఐ యం ఏ చైర్మన్ ,ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు

--ముగిసిన స్మార్ట్ కిడ్జ్ స్పోర్ట్స్ మీట్





ఖమ్మం బ్యూరో, జనవరి 31(తెలంగాణ ముచ్చట్లు) :స్పోర్ట్స్ మీట్ లతో విద్యార్థుల్లో నూతన ఉత్తేజం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ,మాజీ ఐయంఎ ప్రెసిడెంట్ ,ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు తెలియజేశారు. స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించిన స్మార్ట్ కిడ్జ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని పెంచుతున్నాయి అన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా క్రీడా పోటీల ద్వారా విద్యార్థుల్లో మరింత చురుకుదనం , ఏకాగ్రత, పోటీ తత్వం , క్రీడా స్ఫూర్తి పెరుగుతుందని తెలిపారు.స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో విద్యార్థులను క్రీడలతో పాటు అన్ని రంగాలలో నిత్యం ప్రోత్సహించి ఉన్నత స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడం అభినందనీయం అన్నారు. పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ గత రెండు రోజులుగా నిర్వహించిన స్మార్ట్ కిడ్జ్ స్పోర్ట్స్ మీట్ లో విద్యార్థులు అన్ని రకాల క్రీడా పోటీలలో తమ సత్తా చాటి రాణించారని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అంతకుముందు పాఠశాలలో సీనియర్ విద్యార్థులకు కబడ్డీ, కో కో, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగాయి. సభానంతరం 22 రకాల ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతి ప్రధానం చేసి విద్యార్థులను అభినందించారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల శిక్షణను తిరిగి ప్రారంభించాలి

## - తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులను వెంటనే నిలిపివేయాలి

## - ప్రతి వెయ్యి మందికి ఒక గ్రామీణ వైద్యుడిని నియమించి గౌరవ వేతనం ఇవ్వాలి

## - తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం 12వ మహాసభలో స్పర్శ సామాజిక అధ్యయన వేదిక అధ్యక్షులు కాకి భాస్కర్, ప్రముఖ సీనియర్ అడ్వకేట్, తెలంగాణ ఉద్యమ నేత మేకల సుగుణారావు








ఖమ్మం బ్యూరో, జనవరి 31 (తెలంగాణ ముచ్చట్లు) : గ్రామీణ వైద్యులకు ప్యారా మెడికల్ బోర్డ్ ద్వారా మధ్యలో ఆగిన శిక్షణను తిరిగి ప్రారంభించాలని తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం 12వ మహాసభలో స్పర్శ సామాజిక అధ్యయన వేదిక అధ్యక్షులు కాకి భాస్కర్, ప్రముఖ సీనియర్ అడ్వకేట్, తెలంగాణ ఉద్యమ నేత మేకల సుగుణారావు లు అన్నారు. తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ హసన్, జనరల్ సెక్రటరీ షేక్ జానిమియా ల అధ్యక్షతన సమావేశం జరిగింది. ఖమ్మం నగరంలోని టిటిడిసి కార్యాలయంలో శనివారం తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం 12వ మహాసభ ఘనంగా జరిగింది. ఈ సభకు జిల్లా నలుమూలల నుండి మైనారిటీ గ్రామీణ వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొని సభను ఉత్సాహభరితంగా నడిచేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ హసన్, జనరల్ సెక్రటరీ షేక్ జానిమియా లు మాట్లాడుతూ... మైనార్టీ గ్రామీణ వైద్యుల సహకారంతో మైనార్టీలకు సంక్షేమ, అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. కొత్త గ్రామీణ వైద్యులకు అవకాశం కల్పించాలని, శిక్షణ పూర్తి అయిన వారికి సర్టిఫికేట్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ వైద్యులకు శిక్షణ నిర్వహించడానికి ప్రభుత్వం వెంటనే బడ్జెట్ విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు వైద్యరూపంలో సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ పథకాలలో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అదేవిధంగా గ్రామీణ వైద్యులకు చట్టభద్రత కల్పించి ప్రభుత్వ వైద్య పథకాలలో భాగస్వాములను చేయాలన్నారు. గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రతి వెయ్యి మందికి ఒక గ్రామీణ వైద్యుడిని నియమించి గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. గ్రామీణ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులను వెంటనే నిలిపివేయాలనీ,గ్రామీణ వైద్యులపై పెట్టిన కేసులను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వారు బేషరతుగా విరమించుకోవాలన్నారు. తెలంగాణ హెల్త్ మినిష్టర్ రాజనరసింహ ఇటీవల శాసన మండలిలో మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తామని హామీ ఇచ్చారని అదే మాటకు కట్టుబడి శిక్షణను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. మైనార్టీ గ్రామీణ వైద్యులపై ప్రభుత్వం అక్రమంగా ఎటువంటి కేసులను నమోదు చేసినా ఉచితంగా న్యాయ సహాయం చేస్తానని ప్రముఖ అడ్వకేట్ మేకల సుగుణరావు హామీ ఇచ్చారు. అనంతరం కాకి భాస్కర్ ను శాలువతో సన్మానించారు. గ్రామీణ వైద్యులకు బహుమతులను అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ హసన్, వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ నజీరుద్దిన్, జిల్లా కోశాధికారి షేక్ బాబుసాహెబ్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ఖాసీం, షేక్ చాంద్ పాషా, జిల్లా జాయింట్ సెక్రటరీ షేక్ ఆషా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మహ్మద్ సాహెబ్, ప్రచార కార్యదర్శులు షేక్ అమీర్, షేక్ జాని (శ్రీరాంగిరి), షేక్ ఇసాక్ పాషా, కార్యదర్శులు షేక్ అబ్దల్, షేక్ మస్తాన్ పాషా, షేక్ షాజహాన్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు షేక్ మన్సూర్ అలి, షేక్ నబి, షేక్ రబ్బాని, షేక్ అలీ, యం.డి. మహిమూద్, షేక్ అహ్మద్ పాషా, షేక్ వలి, షేక్ నబి,షేక్ ఇమామ్, షేక్ మదర్ సాహెబ్,షేక్ నజీర్,షేక్ షరీఫ్,షేక్ బాజితో పాటు డివిజన్, మండల నాయకులు పాల్గొన్నారు.

# మైనారిటీ సొసైటీల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రవేశ పరీక్ష కు దరఖాస్తుల ప్రారంభం




ఖమ్మం బ్యూరో, జనవరి 31(తెలంగాణ ముచ్చట్లు) : తెలంగాణ మైనారిటీ సొసైటీల సెంటర్ ఆఫ్ ఎక్సిలెన్స్ నందు ఐఐటీ, నీట్, క్లాట్ ప్రవేశాల కొరకు నిర్వహించే రాష్ట్ర వ్యాప్త ఎంట్రన్స్ పరీక్ష ఫిబ్రవరి 14న జరుగుతుంది అని ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 5వ తేదీ వరకు మైనారిటీ సొసైటీ అధికారిక వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ బాలికల కళాశాల ప్రిన్సిపల్ చుండు అఖిల ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థులు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖమ్మం మరియు కొత్తగూడెం విద్యార్థినుల కొరకు ఖమ్మం రాపర్తి నగర్ నందు గల ఖమ్మం బాలికలు 1 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్లో ఉచితంగా నాణ్యమైన బోధన, డిజిటల్ క్లాసులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఐఐటీ-జేఈఈ, ఎన్ఈఈటి కోచింగ్, వసతి మరియు భోజన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ చుండు అఖిల తెలిపారు.మరిన్ని వివరాల కోసం రాపర్తి నగర్ కాలేజీ నందు గానీ 9154365017 నంబర్ నందు గానీ సంప్రదించి ఈ సువర్ణవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# హాస్టల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

## - టిఆర్పి జిల్లా యూత్ అధ్యక్షులు రవికుమార్



కొత్తకోట,జనవరి31(తెలంగాణ ముచ్చట్లు):సర్కారు కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న నాసిరకం భోజనం వల్ల నిత్యం ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు జరుగుతున్నాయని, దీనికి ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు జి. రవికుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని బాలికల బీసీ హాస్టల్లో జరిగిన సంఘటన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు.బీసీ విద్యార్థులకు ప్రభుత్వం పెట్టేది అన్నమా లేక విషమా అని ప్రశ్నించిన రవికుమార్, సర్కారు కళాశాలలు, హాస్టళ్లలో బీసీ విద్యార్థులకు అధ్వానంగా భోజనం పెట్టి పేద విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శించారు. కలుషిత ఆహారం తిని సుమారు 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలయ్యారని తెలిపారు.రాత్రి భోజనం అనంతరం కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు.కొన్ని రోజులుగా ఉడకని అన్నం, నీళ్ల చారు అందిస్తున్నారని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ప్రశ్నించిన విద్యార్థులను మీ ఇంటి వద్ద ఇంతకంటే మంచి భోజనం ఉంటుందా అంటూ హాస్టల్ సిబ్బంది బెదిరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల, హాస్టల్ పరిసరాలు అధ్వానంగా కంపుతో దుర్వాసనతో ఉన్నప్పటికీ అధికారులు, అధికార పార్టీ పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.రాష్ట్రంలో 95 శాతం ఉన్న బీసీలను చులకనగా చూస్తూ, బీసీ ప్రజలు అంటే జంక్ ఫుడ్, కురుకురే, చాక్లెట్లు తింటారంటూ అధికార పార్టీకి చెందిన దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు హేళనగా మాట్లాడటం దుర్మార్గమని రవికుమార్ మండిపడ్డారు.జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే బీసీ హాస్టల్ విద్యార్థులు ఆస్పత్రుల పాలవడానికి కారణమని అన్నారు.ఈ ఘటనకు బాధ్యులైన సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వెంటనే సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని జి. రవికుమార్ హెచ్చరించారు.

# మార్నింగ్ వాక్‌లో సమస్యలపై స్పందించిన నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్



పెద్దమందడి,జనవరి31(తెలంగాణ ముచ్చట్లు): పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో మార్నింగ్ వాక్ సందర్భంగా నూతన సర్పంచ్ పలుస శ్రీనివాన్ గౌడ్ 4వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా దారికి అడ్డంగా ఉన్న చెత్త చెట్లు, రాళ్లు సర్పంచ్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు.ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అడ్డంకులను తొలగించాల్సిన అవసరాన్ని గుర్తించి, అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు.దారికి అడ్డుగా ఉన్న రాళ్లు, చెత్తను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత వారికి సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్‌తో పాటు శ్రీకాంత్ రెడ్డి, సుక్క గిరి, కటికే నీలోజీ హరిజన్ రాములు, బీకే, మల్లేష్ యాదవ్, గొల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధి, ప్రజల సౌకర్యాలే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

# ప్రభుత్వ ప్రాధాన్యత పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మం బ్యూరో, జనవరి -31(తెలంగాణ ముచ్చట్లు) : ప్రభుత్వ ప్రాధాన్యత పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, త్వరితగతిన పూర్తికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో అధికారులతో దళిత బంధు, మెప్మా, సోలార్ పవర్ ప్లాంట్స్, టూరిజం, భూసేకరణ, ఇందిరా మహిళా డైరీ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, అక్షయపాత్ర, ప్రభుత్వ కళాశాలల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, జిల్లాలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టే పనులు వ్యక్తిగత శ్రద్ధతో త్వరితగతిన పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. దళిత బంధు యూనిట్ల పెండింగ్ విడుదల పూర్తి చేయాలన్నారు. డైవర్ట్ అయిన యూనిట్ల విషయంలో చర్యలు వేగవంతం చేయాలన్నారు. మధిర నియోజకవర్గంలో మెప్మా కార్యకలాపాలు చేపట్టాలన్నారు. క్రొత్తగా 200 పట్టణ స్వయం సహాయక సంఘాలను ఏర్పాటుకు, 2000 మంది క్రొత్త సభ్యులను చేర్పుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మధిర లో శిక్షణా కేంద్రం ఏర్పాటుకు స్థలం గుర్తించాలని అన్నారు. బల్క్ గా యూనిట్ల తయారీకి ఏజన్సీ తో టై అప్ చేయాలన్నారు. వీక్లి కార్యాచరణ ప్రణాళిక చేయాలన్నారు. ఎర్రుపాలెం మండలం రాజుపాలెం, కల్లూరు మండలం చిన్న కోరుకోండి లలో ఏర్పాటుచేస్తున్న ఒక మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. మహిళా దినోత్సవం మార్చి 8 లోపు పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. ఖమ్మం లేక్ వ్యూ క్లబ్ పనులు వేగవంతం చేయాలన్నారు. జమలాపురం పర్యాటక అభివృద్ధి పనుల్లో చైన్ లింక్ ఫెన్సింగ్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, సెక్యూరిటీ క్యాబిన్, టికెట్ కౌంటర్, చిల్డ్రన్ ప్లే ఏరియా, అడ్వాంచర్ పార్క్ పనులు పూర్తి చేయాలన్నారు. బౌద్ధస్తూపం పనులు వేగవంతం చేయాలన్నారు. స్తూపం వద్ద పనులతోపాటు, పర్యాటకుల ఆకర్షణకు బాలసముద్రం చెరువులో బోటింగ్, బండ్ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. మెడిటేషన్ కేంద్రంతో బౌద్ధ స్థూపాన్ని చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. గుర్రాలపాడు అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ల వద్ద కమర్షియల్ కాంప్లెక్స్, హెల్త్ సబ్ సెంటర్, చెల్డ్రెన్స్ పార్క్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. హరిత హోటల్ నిర్మాణానికి స్థల గుర్తింపు చేయాలన్నారు. రాయపట్నం హై లెవల్ బ్రిడ్జ్, మధిర ఓఆర్ఆర్ లకు స్థల సేకరణ పూర్తి చేయాలన్నారు. వైరా డంపింగ్ యార్డ్ కు కావాల్సిన స్థల సేకరణ పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ మహిళా డెయిరీ ఏర్పాటుకు ఇంకనూ చేపట్టాల్సిన చర్యలను వేగం చేయాలన్నారు. పాల ధర ఎక్కువ వచ్చేలా హెరిటేజ్, మదర్, అమూల్ డెయిరీలను సంప్రదించాలన్నారు. మరో విడత గేదెల కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇజిఎస్ లో క్యాటిల్ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. బిఎంసియు ల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. తెలంగాణ మాడల్ స్కూళ్ల నిర్మాణానికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. స్కూళ్ల నమూనా, ఖర్చు వివరాలతో ప్రణాళిక చేయాలన్నారు. 12 స్కూళ్ల అభివృద్ధి లో భాగంగా స్కూళ్లలో స్థలం లభ్యత, చేపట్టాల్సిన సౌకర్యాలపై నివేదిక సమర్పించాలన్నారు. అక్షయపాత్ర ద్వారా హైజనిక్ ఫుడ్ అందుతుందని కలెక్టర్ అన్నారు. సెంట్రలైజ్ కిచెన్ ల ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలన్నారు. మధిర డిగ్రీ కళాశాల, సిరిపురం ఐటిఐ , సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, మధిర జూనియర్ కళాశాల, బనిగండ్లపాడు జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. కళాశాల ల మరమ్మతులకు మంజూరైన నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. వైరా, సత్తుపల్లి, పాలేరు, మధిర, ఖమ్మం నియోజకవర్గాల్లో మంజూరైన వీటిలో, వైరా, సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. మిగతా చోట పురోగతిలో ఉన్న పనుల్లో వేగం పెంచాలని, పూర్తయిన పనుల రికార్డులు నమోదుచేసి, బిల్లుల చెల్లింపుకు వెంట వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. కెజిబివి స్కూళ్ల పెయింటింగ్ చేయాలన్నారు. ప్రాధాన్యత పనుల పూర్తికి అధికారులు పర్యవేక్షణ చేస్తూ, రోజువారీ పనుల పురోగతిని సమీక్షించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్డీసి రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, డిఇఓ చైతన్య జైని, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, ఇడి ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, డిఆర్డీవో శ్రీరామ్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు, విద్యాశాఖ ఇఇ బుగ్గయ్య, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీరనారాయణపురంలో విషాదం

## - కెనాల్‌లో పడి ఐదేళ్ల బాలుడు మృతి



ఎల్కతుర్తి, జనవరి 31(తెలంగాణ ముచ్చట్లు) : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వీరనారాయణపురం గ్రామంలో శుక్రవారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చదరం ప్రశాంత్ కుమారుడు శశివర్ధన్ (5) ఆడుకుంటూ ప్రమాదవశాత్తు గ్రామ సమీపంలోని చిన్న కెనాల్ (డీబీఎం--23)లో పడిపోయి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం, ఇంటి సమీపంలో పిల్లలతో కలిసి ఆడుకుంటున్న శశివర్ధన్ అనుకోకుండా కెనాల్‌లో జారిపడ్డాడు. కొంతసేపటి తర్వాత విషయం గమనించిన గ్రామస్తులు వెంటనే కెనాల్‌లోకి దిగి బాలుడిని బయటకు తీసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారణ కావడంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు. ఈ ఘటనతో బాలుడి తల్లిదండ్రులు ప్రశాంత్, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. చిన్న వయసులోనే కుమారుడిని కోల్పోవడంతో కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామానికి సమీపంలో ఉన్న కెనాల్‌కు తగిన రక్షణ చర్యలు, గోడలు లేదా హెచ్చరిక బోర్డులు లేకపోవడమే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషాద ఘటనతో వీరనారాయణపురం గ్రామం మొత్తం శోకవాతావరణంలో మునిగిపోయింది.

# 19వ వార్డులో గులాబీ--ఎరుపు సమన్వయ ప్రచారం జోరు

## - ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
## - పాకలపాటి లక్ష్మీ.





సత్తుపల్లి, జనవరి 31 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి పట్టణ పురపోరు ఎన్నికల్లో 19వ వార్డులో గులాబీ--ఎరుపు దళం సమన్వయంతో సాగుతున్న ప్రచారం హోరెత్తుతోంది. బీఆర్ఎస్ మద్దతుతో సీపీఎం కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్న పాకలపాటి లక్ష్మీ గడపగడపకు తిరుగుతూ ఓటర్లను కలుసుకుంటున్నారు. శనివారం నాటికి వార్డులోని ప్రతి ఓటరును మూడుసార్లు ప్రత్యక్షంగా కలిసి, సుత్తి--కొడవలి--నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్, సీపీఎం నేతలు సుమారు 40 మంది కలిసి కాలినడకన ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆప్యాయంగా పలకరించారు. కరచాలనం చేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులోని మౌలిక వసతుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని పాకలపాటి లక్ష్మీ హామీ ఇచ్చారు. ముఖ్యంగా సైడ్ డ్రైన్ల నిర్మాణం, అంతర్గత రహదారుల అభివృద్ధి, పెన్షన్ల మంజూరు, పక్కా ఇళ్లు, పట్టణ పేదలకు ఉపాధి హామీ పథకం అమలు వంటి అంశాలపై ప్రభుత్వంపై గళం విప్పుతానని ఆమె స్పష్టం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు కంచర్ల నాగేశ్వరరావు, నాగార్జున వెంకటాచారి, పరిమి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి నరసింహారావు, మోరంపూడి వెంకటేశ్వరరావు, రాగం సత్యనారాయణ, శ్రావణ్‌తో పాటు సీపీఎం కార్యకర్తలు రావుల రాజబాబు, మల్లూరు చంద్రశేఖర్, పాకలపాటి ఝాన్సీ, పాకలపాటి శ్రీను, మల్లికార్జునరావు, చప్పిడి భాస్కర్, రాయల రాణీ రుద్రమ్మదేవి, జాజిరి జ్యోతి, చీకటి అజిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణను పకడ్బందీగా నిర్వహించాలి

## -రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి







ఖమ్మం బ్యూరో, జనవరి -31(తెలంగాణ ముచ్చట్లు) : ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణకార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం అధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటిని సందర్శించి వివరాలు సేకరించాలని, ఓటరు జాబితాలో గల ఓటర్ల మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారి తరపున ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని అన్నారు. జరగబోయే ప్రత్యేక సమగ్ర సవరణ పట్ల రాజకీయ పార్టీలకు అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. పెండింగ్ ఫారం 6, 6ఏ, 7, 8 లను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఇట్టి వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎస్డీసి రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 11వ వార్డు బిజెపి అభ్యర్థి వారే వనిత బిజెపి ఇంటింటా ప్రచారం

మెదక్, జనవరి 31(తెలంగాణ ముచ్చట్లు): : మెదక్ పట్టణంలోని 11వ వార్డు అభ్యర్థి వారే వనిత బిజెపి నాయకులతో కలిసి శనివారం ఇంటింటా ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ అభివృద్ధి కార్యక్రమాన్ని అమృత్ సిటీ లో భాగంగా భారతీయ జనతా పార్టీ కేంద్రం నుండి అత్యధిక నిధులు ఇచ్చి అమృత్ సిటీలను తయారు చేయడానికి నరేంద్ర మోడీ నాయకత్వంలో కంకణం కట్టుకొని భారత ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్న భారతీయ జనతా పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని మెదక్ మున్సిపల్ పట్టణ 11వ వార్డు బిజెపి అభ్యర్థిని వారే నవిత తెలిపారు. 11వ వార్డులో అనేక భవంతులు ఉన్నాయని వాటిపైన అత్యధికంగా టాక్సులు వసూలు చేయడం సరికాదని ఆమె తెలిపారు. అదే విధంగా అధిక టాక్సీలు చెల్లిస్తున్న వార్డులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నాటి కౌన్సిల్ విఫలం అయిందన్నారు. బిజెపి తరఫున మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆధ్వర్యంలో అన్ని వార్డులను అమృత్ సిటీ జాబితాలో కలుపుతూ త్రాగునీరు మురికి కాలువల క్రమబద్ధీకరణ మౌలిక వసతులు పారిశుద్ధ్యము పై ప్రణాళికలు ప్లాస్టిక్ కవర్ నిషేధం. పార్క్. పచ్చదనం వార్డులో అనుసరి స్తామని మెదక్ పట్టణాన్ని నందనవనంగా చేయడం బిజెపి లక్ష్యం అని వనిత తెలిపారు. మెదక్ పట్టణంలో స్మశాన వాటికల పరిస్థితిని ప్రజలు గమనించాలని సూచించారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థినీ గెలిపించండని అభ్య ర్థించారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు వడ్ల జనార్దన్, కృష్ణారెడ్డి, వారే శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిరసన

సత్తుపల్లి,జనవరి31 (తెలంగాణ ముచ్చట్లు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై జరుగుతున్న రాజకీయ వేధింపులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా కల్లూరులో శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ మండల పార్టీ పిలుపు మేరకు కల్లూరు పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరగనుంది. ఈ నిరసనకు సత్తుపల్లి మాజీ శాసనసభ్యుడు సండ్ర వెంకట వీరయ్య నాయకత్వం వహిస్తున్నారు. పార్టీ అధినేతపై రాజకీయ కక్షతో చర్యలు చేపడుతున్నారని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. కల్లూరు పట్టణం, మున్సిపాలిటీ పరిధిలోని ఇరవై వార్డుల నాయకులు, తాజా మరియు మాజీ ప్రజాప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పార్టీ పిలుపునిచ్చింది. మీడియా ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు తెలిపారు.

# రోడ్డు నియమాలే ప్రాణ రక్షణ

- సత్తుపల్లిలో రోడ్డు భద్రత అవగాహన ప్రదర్శన
- మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధం
- మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జె.ఎన్.శ్రీనివాసరావు






సత్తుపల్లి, జనవరి 31(తెలంగాణ ముచ్చట్లు): రోడ్డు భద్రత అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరి బాధ్యత అని సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జె.ఎన్. శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు నియమాలు పాటిస్తే ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల (జనవరి 1 నుంచి 31 వరకు) ముగింపు సందర్భంగా శనివారం సత్తుపల్లిలో రవాణా శాఖ ఆధ్వర్యంలో భారీ ఎత్తున రోడ్డు భద్రత అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారితో రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, వారి డ్రైవర్లు, గంగారం బెటాలియన్ పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రవాణా శాఖ అధికారులు శ్రీనివాసరావు, రాజశేఖర్ రెడ్డి, సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని తెలిపారు. ఇటువంటి చర్యలు వారి భవిష్యత్తుతో పాటు ఇతరుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతాయని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రయాణాన్ని సురక్షితంగా, సుఖవంతంగా మార్చుకోవాలని సూచించారు. వేగం కన్నా ప్రాణమే మిన్న అనే విషయాన్ని గుర్తించి వాహనాలు నడపాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం ప్రాధాన్యతను వివరించారు. అవగాహన ప్రదర్శనలో రోడ్డు భద్రతపై నినాదాలు, పాటలు ప్రజలను ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీస్ అధికారి సత్యనారాయణ, ప్రైవేటు విద్యాసంస్థల సంఘం సత్తుపల్లి డివిజన్ (ట్రస్మా) అధ్యక్షుడు పసుపులేటి నాగేశ్వరరావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యర్థులవి 'సొల్లు కబుర్లు'.. మావి చేతల పనులు!

- పదేళ్ల దొరల పాలనలో పేదలకు ఒరిగింది శూన్యం
- కమిషన్ల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం ఏమైందో చూడండి
- ఏదులాపురం ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ పై మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు






ఖమ్మం బ్యూరో, జనవరి 31(తెలంగాణ ముచ్చట్లు) :"ఎన్నికలు రాగానే ప్రత్యర్థులు మీ ముందుకు వచ్చి 'సొల్లు కబుర్లు' చెబుతారు.. మాయమాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు. కానీ, పదేళ్లు అధికారంలో ఉండి పేదవాడికి ఒక ఇల్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారు?" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై నిప్పులు చెరిగారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 6, 25వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల శంఖారావం పూరించారు.

**అకౌంట్లు నింపుకోవడమే గత పాలకుల ధ్యేయం**

ప్రచార సభల్లో మంత్రి పొంగులేటి పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప, సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కళ్లముందే కూలిపోతోంది. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా?" అని ప్రశ్నించారు.రెండుసార్లు అబద్ధపు హామీలతో అధికారం లోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు.

**- చేతల ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం**

తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాటను నిలబెట్టుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. "మేము మాటలు చెప్పేవాళ్లం కాదు.. పనిచేసే వాళ్లం. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు రూ. 5 లక్షల సాయం అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఉచిత బస్సు ప్రయాణం, ?500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, ఇవే తమ ప్రభుత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**ఏదులాపురానికి కొత్త హంగులు**

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి పునరుద్ఘాటించారు. "వచ్చే వర్షాకాలం నాటికి మున్నేరు రక్షణ గోడను పూర్తి చేసి ప్రజల కష్టాలు తీరుస్తాం. ఎఫ్.సి.ఐ గోడౌన్ తరలింపుతో పాటు ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాం. మీ కష్టం తెలిసిన మీ పెద్ద కొడుకుగా నేను మీకు అండగా ఉంటా" అని హామీ ఇచ్చారు. విపక్షాల సొల్లు కబుర్లను నమ్మకుండా, అభివృద్ధిని కాంక్షిస్తూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

రంగారెడ్డి, జనవరి 31 :(తెలంగాణ ముచ్చట్లు): ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించెందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు ఎన్నికల నిర్వహణలో భాగంగా షాద్ నగర్ షాద్ నగర్ మున్సిపాలిటీకి సంబంధించిన నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్ తో కలిసి శనివారం పరిశీలించారు నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను పరిశీలిస్తూ ఏ విధంగా స్క్రూటిని చేస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకొని, పొరపాట్లు జరగకుండా చేయాలని, వారికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి షాద్ నగర్ మున్సిపాలిటీకి సంబంధించిన ఏర్పాట్లను, ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తు, ఎన్నికలకు సంబంధించిన ఫర్నిచర్ అదేవిధంగా స్టేషనరీ తదితర అంశాలను మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డిని అడిగి తెలుసుకొని నామినేషన్లకు సంబంధించి స్క్రూటిని ప్రక్రియను స్ట్రాంగ్ రూమును, కౌంటింగ్ హాల్ ను పరిశీలించారు.

# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



ఖమ్మం బ్యూరో, జనవరి 31(తెలంగాణ ముచ్చట్లు) : ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారు డి. రామయ్య (ఎస్సై) ఏ.గోపి (ఏఆర్ఎస్సై) ఏస్కె. యాకుబ్ పాషా (ఏఆర్ఎస్సై) పి.శాంతారెడ్డి (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్) జి. వెంకన్న (హోంగార్డ్ పి ఎల్ సి ) ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం,అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, ఏసీపీ సుశీల్ సింగ్ , ఆర్ ఐ శ్రీశైలం,నాగుల్ మీరా పోలీస్ అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షుడు వేంకటేశ్వర్లు,అర్సిర్సి లక్ష్మణరావు ఖమ్మం జిల్లా హోం గార్డ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బంక శ్రీను, సభ్యులు సీహెచ్ నాగరాజు తదితలు పాల్గొన్నారు.

# పేద బిడ్డలు ఉన్నత చదువులు చదవాలి

–దళిత బిడ్డల అభ్యున్నతే లక్ష్యంగా మాస్ సంస్థ




వరంగల్,జనవరి31 (తెలంగాణ ముచ్చట్లు): పేద కుటుంబాలకు చెందిన బిడ్డలు ఉన్నత చదువులు చదివి జీవితంలో ఎదగాలన్న లక్ష్యంతో మాస్ సంస్థ పనిచేస్తోందని సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ విజయ్ కుమార్ సీనపెల్లి తెలిపారు. ఆయన మాట్లాడుతూ, విద్యే సామాజిక మార్పుకు ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. అయినవోలు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రాడపాక భారత్ అనే నిరుపేద విద్యార్థి తండ్రి లేకుండా, తల్లి కూలీ పనులు చేస్తూ చదివిస్తున్న కుటుంబానికి చెందినవాడని తెలిపారు. హైదరాబాద్‌లోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థి చదువులో ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యాన్ని మహా ఆది సేవ సంస్థ సభ్యుడు జన్ను నరేందర్ మాస్ సంస్థ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో మాస్ సంస్థ విద్యార్థికి కళాశాల ఫీజు, పుస్తకాలు, హాస్టల్ వసతి ఖర్చులకుగాను ఆరు నెలల కోసం ముప్పై వేల నాలుగు వందల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా మాస్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, బి.ఆర్. అంబేద్కర్ ఇచ్చిన "పే బ్యాక్ టు ది సొసైటీ" పిలుపును ఆదర్శంగా తీసుకుని గత ఆరు సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు రెండువందల యాభై మంది పేద విద్యార్థులకు ముప్పై మూడు లక్షల పద్దెనిమిది వేల రెండువందల ఎనిమిది రూపాయల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.ఉన్నత విద్య కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద విద్యార్థులు లేదా వారికి సహాయం చేయదలచిన దాతలు 9010730380 నంబర్‌ను సంప్రదించాలని మాస్ సంస్థ సూచించింది. ఈ కార్యక్రమంలో మాస్ సంస్థ సభ్యులు ఇరుగు వెంకన్న, ఇల్లందుల బాబు, లింగాల శ్రీనివాస్, విక్రమ్ కుమార్, మునిగాల వినయ్ కుమార్ పాల్గొన్నారు.

# వ్యవసాయ సాగునీటి కోసం డ్రైనేజీ కాలువ నిర్మాణం

ధర్మపురి, జనవరి 31 : జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం బుగ్గారం మండలంలోని నేరేళ్ల, గోవిందుపల్లె గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిర్విరామంగా కృషి చేస్తున్నారని బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, న్యాయవాది జాజాల రమేష్ పేర్కొన్నారు. గోవిందు పల్లెలో ప్రజాబీష్టం మేరకు రోడ్డు నిర్మాణానికి మంత్రి నిధులు మంజూరు చేశారని, అలాగే గోవిందు పల్లె,నేరెళ్ల గ్రామాల రైతుల వంట పొలాలకు సాగునీరందే మార్గాల్లో కాల్వలకు డ్రైనేజీ సదుపాయం కల్పిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయించారని తెలిపారు.

## రాత్రంతా పొట్లాడుకున్నారా ఇద్దరూ...


ఒకరు వెన్నెలని,
ఇంకొకరు..
కాదు, రొట్టెముక్కని.

వాస్తవానికి రెండూ నిజాలే.

వారికి తెలియనిదల్లా
ఎవరి కనుకొనల్లో
ఏ కల కొట్టుమిట్టాడుతుందో
అదే నిజమై వారికెదురుపడుతుందని.

హక్కులు ఉత్తి గాలిపడవలై సాగే
ముళ్ళసముద్రం ఈ సమాజం
ఇక్కడ
ప్రేమ నిషిద్ధం

అందుకే
ప్రేయసిని వెన్నెల్లో చూసుకోవడం,
వెన్నెల్లో రొట్టెముక్కని చూడటం,
రెండూ విప్లవాలే ఈ నేలమీద!!



దియా విఘ్నేష్

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# ఆరోగ్యం



## ఉదయాన్నే ఈ 7 పనులు చేస్తే చాలు.. ఫాస్ట్‌గా కోటీశ్వరులు అయిపోతారు!, ఆరోగ్యం కూడా!

జీవితంలో విజయం సాధించాలంటే మనస్సులో పాజిటివ్ ఆలోచనలు, ప్రేరణ ఉండటం ఎంతో అవసరం. మన చుట్టూ పాజిటివ్ వ్యక్తులు ఉన్నా.. మన మనసులో మంచి ప్రేరణ లేకపోతే మనం ముందుకు వెళ్ళలేం. మనస్సులో సానుకూల భావనలు ఉ న్నప్పుడు, ఏ సమయంలోనైనా మనం కష్టాలు ఎదుర్కొన్నా వాటిని అధిగమించి విజయం సాధించగలుగుతాం. మీరు నిరంతరం చెడు ఫలితాలు వస్తున్నా, వాటిని ఎక్కువగా ఎదుర్కొంటుంటే.. ఈ 7 మార్నింగ్ హాబిట్స్‌ను మీ రోజు ప్రారంభంలో చేసేయండి. ఈ అలవాట్లు మీ మనస్సులో సానుకూల ఆలోచనలు జలగపెడతాయి, మరియు మీరు మీరే ప్రేరణను పొందగలుగుతారు. తద్వారా మీరు అనుకున్న పనులన్నిటినీ పూర్తి చేయగలుగుతారు. ఆ హ్యాబిట్స్ ఏంటో ఇక్కడ తెలుసుకుందాం..

1. దేవుడిని మొక్కడం: నిద్రలేచిన వెంటనే, మీ రోజు దేవుడికి మొక్కడం, మొక్కులు చెల్లించడం ద్వారా ప్రారంభించండి. కొంతమంది మంచం నుంచి దిగడమే ఆలస్యం వారికి ఎక్కడ లేని అలసట వచ్చేస్తుంది. బద్ధకంతో కూర్చుండిపోతారు. అందుకే ప్రతిరోజూ తమ తమ రోజును ప్రారంభించే ముందు దేవుడి ఫోటో ముందు నిల్చొని వారిని మొక్కి రోజును ప్రారంభించండి, మీ రోజు అద్భుతంగా మారుతుంది.

2. వ్యాయామం చేయడం ప్రతి రోజూ ఉదయం 5 నిమిషాల వ్యాయామంతో ప్రారంభించడం మంచిది. ఇది మీ శరీరానికి, మనస్సుకు మంచిది. అలాగే మీ జీవితంపై సానుకూలమైన ప్రభావం చూపిస్తుంది. కాలక్రమంలో, మీరు ఈ వ్యాయామం చేయడాన్ని అలవాటుగా మార్చుకుంటారు, అది మీరు 30 నిమిషాల వరకు కొనసాగించగలుగుతారు.

3. నీరు తాగడం నిద్రలేచిన తర్వాత నీరు తాగడం ఎంతో ముఖ్యం. 7-8 గంటలు నిద్ర పోయిన తర్వాత శరీరానికి శక్తి చాలా అవసరం. ఆ శక్తి పొందడానికి మంచి మార్గం నీరు తాగడం. దీని వల్ల మీ మెటాబాలిజం పెరుగుతుంది. శరీరంలో ఉన్న టాక్సిన్స్ తొలిగిపోతుంది. కాబట్టి, ఉదయం టీ లేదా కాఫీ తీసుకోవడానికి ముందు నీరును తాగి మీ రోజును ప్రారంభించండి.

4. చేయాల్సిన పనులు లిస్ట్ చేసుకోండి

ఉదయం కలిగిన సానుకూల శక్తితో, ఆ రోజు చేయాల్సిన పనులను జాబితా చేయండి. అవి మీకు ఆ రోజు మైలురాయిలను చేరుకునేందుకు ప్రేరణను ఇస్తాయి. 5. ఫోన్‌ను దూరంగా ఉంచండి ఉదయం లేచిన వెంటనే, మీ మొబైల్, ల్యాప్టాప్ లేదా టీవీ నుంచి దూరంగా ఉండండి. గడియారాన్ని చూసి సమయాన్ని చూసుకోండి. ఫోన్ పట్టుకోవడం వల్ల మీరు అనవసరమైన మెసేజ్లు, మెయిల్స్ లేదా సోషల్ మీడియా అప్ డేట్స్‌తో సమయాన్ని వృథా చేస్తారు, అలాగే ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుంది.

6. ఆరోగ్యకరమైన అల్పాహారం ఆరోగ్యకరమైన అల్పాహారం తీసుకోవడం ముఖ్యమైనది. ఉదయం పండ్లు, గింజలు, మొలకెత్తిన గింజలు వంటి ఆహారాలు తీసుకుంటే శరీరానికి మరియు మెదడుకు మంచి శక్తి అందుతుంది, తద్వారా మీరు మొత్తం రోజు పనిచేసే సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. 7. ప్రస్తుత పనిలో దృష్టి సారించండి మీరు చేస్తున్న పనిని పూర్తి మరిచిపోకుండా దృష్టిని కేంద్రీకరించండి. ఇతర ఆలోచనలు మీ మనస్సులోకి రానివ్వకండి. దీనివల్ల మీరు పనిని సరిగ్గా పూర్తి చేయగలుగుతారు, సమయం వృథా చేయకుండా కచ్చితంగా మీరు విజయం సాధించగలుగుతారు. ఈ 7 అలవాట్లు మీ మనస్సులో సానుకూల ఆలోచనలన్నింటిని పెంచుతూ, విజయాన్ని సాధించడంలో మీకు సహాయం చేస్తాయి.

## పురాతన రాజులు మటన్‌ను ఇలాగే వండుకొని తినేవారు

హైదరాబాద్ అంటే మనందరికీ గుర్తుకొచ్చేది బిర్యాని, ఇరానీ చాయ్ మాత్రమే. దీంతో పాటూ రకరకాల చూడముచ్చటైన ప్రదేశాలు అనేకం ఉంటాయి. అలాగే హైదరాబాద్ అంటే గుర్తుకొచ్చేది చరిత్ర, ఆ చరిత్రలో దాగి ఉన్న ఎన్నో రకాల వంటలు కూడా. ఒక్క మాటలో చెప్పాలంటే హైదరాబాద్‌లో పురాతన కాలం నుంచి వారసత్వంగా వస్తున్న ఎన్నో రకాల వంటకాలు ఉన్నాయి. ఇవి ప్రపంచ వ్యాప్తంగా కూడా చాలా ప్రాముఖ్యతను సంపాదించుకున్నాయి. అలాంటి వాటిల్లో ఒకటే బిర్యాని, ఇంకొకటి పత్తర్ కా ఘోష్. హైదరాబాదీ బిర్యాని గురించి మనందరికీ తెలిసిందే. దానిని ఎలా చేసుకోవాలో కూడా తెలుసు. కానీ చాలా మందికి పత్తర్ కా ఘోష్ ఎలా చేసుకోవాలో తెలియదు. అందుకే ఈ స్టోరీలో ఈ పత్తర్ కా ఘోష్ ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? ఏ విధంగా దానిని చేసుకోవాలి అనేది తెలుసుకుందాం.

పత్తర్ కా ఘోష్ తయారు చేయడానికి కావలసిన పదార్థాలు: మటన్ లేదా గొర్రె మాంసం పెరుగు అల్లం వెల్లుల్లి పేస్ట్ పసుపు కారం ధనియాల పొడి గరం మసాలా ఉప్పు నూనె.

పత్తర్ కా ఘోష్ తయారీ విధానం: మాంసాన్ని చిన్న ముక్కలుగా కట్ చేయాలి. పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు వేసి మాంసాన్ని బాగా కలపాలి. ఒక పెద్ద రాయిని బాగా వేడి చేయాలి. నూనె రాసి మాంసం ముక్కలను రాయిపై వేసి కాల్చాలి. మాంసం బాగా ఉడికిన తర్వాత, దాన్ని సర్వ్ చేయాలి. ప్రత్యేకత:



పత్తర్ కా ఘోష్ యొక్క ప్రత్యేకత ఏమిటంటే, ఇది రాతిపై వండటం వల్ల దీనికి ఒక ప్రత్యేకమైన రుచి వస్తుంది. అంతేకాకుండా, ఇది చాలా ఆరోగ్యకరమైన వంటకం. ఇందులో నూనె చాలా తక్కువగా ఉపయోగిస్తారు.

ఆరోగ్య ప్రయోజనాలు: మాంసంలో ప్రోటీన్ ఉంటుంది, ఇది శరీర కణాల నిర్మాణానికి మరియు మరమ్మత్తుకు అవసరం. ఇందులో ఐరన్ ఉంటుంది, ఇది రక్తహీనతను నివారించడానికి సహాయపడుతుంది. జింక్ రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. విటమిన్ బి12 నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. పత్తర్ కా ఘోష్‌లో నూనె తక్కువగా ఉండటం




వల్ల ఇది ఆరోగ్యకరమైన వంటకం. హైదరాబాద్‌లో పత్తర్ కా ఘోష్ ప్రత్యేకమైన వంటకం. పాతబస్తీలో దీనిని ప్రత్యేకంగా తయారు చేస్తారు. పర్యాటకులు హైదరాబాద్ వచ్చినప్పుడు, ఈ వంటకాన్ని తప్పకుండా రుచి చూస్తారు. అలాగే ఈ ఆహారాన్ని తక్కువగా తినాలి. అధిక మొత్తంలో తీసుకుంటే ఎన్నో రకాల సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.



## విజేత రైబకినా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ టైటిల్‌ను 5వ సీడ్, కజకిస్తాన్‌కు చెందిన ఎలైనా రైబకినా చేజిక్కించుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో రైబకినా మూడుసెట్ల హోరాహోరీ పోరులో టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకాను చిత్తుచేసింది. దీంతో కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. 2023లో తొలిసారి ఫైనల్‌కు చేరినా.. రన్నరప్‌కే పరిమితమైన రైబకినా.. ఈసారి పట్టువదలక టైటిల్‌ను సాధించడం విశేషం. హోరాహోరీగా సాగిన ఫైనల్లో రైబకినా 4-6, 6-4, 4-6తో సబలెంకాను చిత్తుచేసింది. చివరి సెట్ 3-3 పాయింట్లతో సమం ఉన్న దశలో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి రైబకినా 4-3 పాయింట్ల ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత తన సర్వీసును, చివరి సర్వీసును కూడా నిలుపుకొని విజేతగా నిలిచింది. దీంతో కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడింది.

## ఇషాన్ కిషన్ సెంచరీ

తిరువనంతపురం: ఐదో టి20లోనూ టీమిండియా ఘన విజయం సాధించింది. తిరువనంతపురం వేదికగా జరిగిన చివరి టి20లో భారతజట్టు 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 271పరుగుల భారీస్కోర్ చేసింది. ఈ ఫార్మాట్‌లో టీమిండియాకు ఇదే అత్యధిక స్కోర్ కాగా.. ఓవరాల్‌గా ఈ ఫార్మాట్‌లో మూడో అత్యధిక స్కోర్ నమోదు చేసింది. 272 పరుగుల భారీ లక్ష్యంగాతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు పవర్-ప్లే 6ఓవర్లలోనే 79పరుగులు చేసి ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభిం చింది. ఫిన్ అలెన్(80), రచిన్ రవీంద్ర(30), ఇష్ సోథీ(33) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఆర్షదీప్ సింగ్(5/51) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో పాటు అక్షర్ పటేల్(3/33) మెరిసారు. దీంతో న్యూజిలాం డ్ 19.4ఓవర్లలో 225పరుగులకు ఆలౌటైంది. దీంతో ఐదు టి20ల సిరీస్‌ను భారత్ 4-1తో చేజిక్కించుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ ఇషాన్, సిరీస్ సూర్యకుమార్ యాదవ్‌కు దక్కాయి.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఈ సిరీస్‌లో పేలవ ఫామ్‌తో నిరాశపరుస్తున్న సంజు శాంసన్(6) మరోసారి స్వల్పస్కోర్‌కే పెవీలియన్‌కు చేరాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ, సూర్య కుమార్ యాదవ్ మెరుపు ఇన్నింగ్స్‌తోపాటు భారత బ్యాటర్లు రాణించడంతో ఇండియా భారీ స్కోరు నమోదు చేసింది. 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి, 271 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ 16 బంతుల్లోనే 30 పరుగులు చేయగా.. ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 43 బంతుల్లోనే 4 ఫోర్లు, 10 సిక్సర్లతో 103 పరుగులు చేశాడు. అతడి స్ట్రైక్ రేటు 239. హార్థిక్ పాండ్యా 17 బంతుల్లో ఒక ఫోర్, 4 సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. తర్వాత వచ్చిన రింకూ సింగ్ 8 బంతుల్లో 8 పరుగులు, శివం దూబే 2 బంతుల్లో 7 పరుగులు చేయడంతో ఇండియా 271 పరుగులు చేసింది. న్యూజిలాండ్ బౌలర్లలో ఫెర్గుసన్‌కు రెండు, సాంట్నర్, జేమీసన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (బి)ఫెర్గుసన్ 30, సంజు శాంసన్ (సి)జాకోబ్స్ (బి)ఫెర్గుసన్ 6, ఇషాన్ కిషన్ (సి)ఫిలిప్స్ (బి)డఫీ 103, సూర్యకుమార్ యాదవ్ (సి)సెఫెర్ట్ (బి)సాంట్నర్ 63, హార్దిక్ పాండ్యా (సి)జాకోబ్స్ (బి)జేమీసన్ 42, రింకు సింగ్ (నాటౌట్) 8, దూబే (నాటౌట్) 7, అదనం 12.



(20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 271పరుగులు. వికెట్ల పతనం: 1/31, 2/48, 3/185, 4/233, 5/261 బౌలింగ్: డఫీ 4-0-53-1, జేమీసన్ 4-0-59-1, ఫెర్గుసన్ 4-0-41-2, ఇష్ సోథీ 3-0-48-0, ఫిలిప్స్ 1-0-10-0, సాంట్నర్ 4-0-60-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సెఫెర్ట్ (సి)హార్దిక్ (బి)ఆర్షదీప్ 5, అలెన్ (సి)రింకు సింగ్ (బి)అక్షర్ 80, రచిన్ రవీంద్ర (సి)అక్షర్ పటేల్ (బి)ఆర్షదీప్ 30, ఫిలిప్స్ (సి)రింకు సింగ్ (బి)అక్షర్ 7, మిఛెల్ (బి)ఆర్షదీప్ 26, సాంట్నర్ (సి)సూర్యకుమార్ (బి)ఆర్షదీప్ 0, జాకోబ్స్ (బి)వరుణ్ చక్రవర్తి 7, జేమీసన్ (బి)ఆర్షఈప్ 9, ఇష్ సోథీ (సి)ఆర్షదీప్ (బి)రింకు సింగ్ 33, ఫెర్గుసన్ (బి)అక్షర్ 3, డఫీ (నాటౌట్) 9, అదనం 16. (19.4ఓవర్లలో ఆలౌట్) 225పరుగులు. వికెట్ల పతనం: 1/17, 2/117, 3/131, 4/137, 5/137, 6/166, 7/179, 8/180, 9/191, 10/225 బౌలింగ్: ఆర్షదీప్ 4-0-51-5, హార్దిక్ పాండ్యా 2-0-15-0, బుమ్రా 4-0-58-0, వరుణ్ 4-0-36-1, అక్షర్ పటేల్ 4-0-33-3, అభిషేక్ శర్మ 1-0-13-0, రింకు సింగ్ 0.4-0-7-1.

# సినిమా న్యూస్



## చీరకట్టులో నడుము అందాలతో
# చక్కిలిగింతలు పెడుతున్న స్వయంభు బ్యూటీ!



గ్లామర్ తోనే కాదు చీర కట్టులో కూడా ఆడియన్స్ ను ఆకట్టుకోవచ్చు అని నిరూపిస్తున్న అతి కొద్ది మంది హీరోయిన్స్ లో నభా నటేష్ కూడా ఒకరు. నిత్యం తన అందంతో ప్రేక్షకులలో గిలిగింతలు పెట్టే ఈ ముద్దుగుమ్మ.. మరోసారి చీరకట్టులో అందాలతో మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా నడుము అందాలను చూపిస్తూ కుర్రకారు గుండెల్లో గుణపాలు దింపేసింది ఈ వయ్యారి. ఒకవైపు నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూనే. మరొకవైపు తన ప్రతిభతో అందరినీ ఉర్రూతలూగిస్తోంది. ప్రస్తుతం వరుస పెట్టి అవకాశాలు దూసుకుపోవడమే కాకుండా ఇంస్టాగ్రామ్ లో తన లుక్ తో రోజుకొక ఫోటో షేర్ చేస్తూ ఆశ్చర్యపరుస్తోంది. అందులో భాగంగానే తాజాగా చీరకట్టులో కనిపించింది . సూర్యుడి కిరణాలను ముఖానికి తగలకుండా చేతులు అడ్డుపెట్టుకుంటూ షేర్ చేసిన ఫోటోలు వైరల్ గా మారుతున్నాయి. ఇందులో ఈమె అందాలు చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. క్రీమ్ అండ్ గోల్డ్ కాంబినేషన్ లో చెక్స్ తో కలగలిసిన ఈ కాటన్ చీర ఈమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. దీనికి కాంబినేషన్లో వైట్ కలర్ బ్లౌజ్ ధరించిన ఈమె ఆ లుక్కుతో తన మేకోవర్ను పర్ఫెక్ట్ అని నిరూపించుకుంది. మొత్తానికైతే నభా నటేష్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మరోవైపు నభా నటేష్ వరుస సినిమాలలో అవకాశాలు అందుకుంటుంది.. అందులో భాగంగానే తాజాగా ఈమె నిఖిల్ సరసన స్వయంభు సినిమాలో నటిస్తోంది. ఇందులో చాలా పవర్ఫుల్ పాత్రలో నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తూ.. ఈమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సినిమాతో పాటు నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్ అనే సినిమాలో కూడా నటిస్తోంది . ఇందులో పార్వతీ పాత్రలో నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో పాన్ ఇండియాగా వస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో నభా పాత్ర శక్తివంతమైన, రహస్యమైన అలాగే సాంప్రదాయ రూపాన్ని కలిగి ఉందని మేకర్స్ ప్రకటించడంతో ఈమె పాత్ర పై అంచనాలు పెరిగిపోయాయి. ఇకపోతే టైసన్ నాయుడు అనే సినిమాలో కూడా ఈమె అవకాశాన్ని అందుకుంది. ఇలా వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోతున్న నభా నటేష్ ఈ సినిమాలతో మంచి విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ఎందుకంటే గతంలో ఇస్మార్ట్ శంకర్ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న ఈమె.. ఆ తర్వాత డార్లింగ్, సోలో బ్రతికే సో బెటర్ , డిస్కో రాజా వంటి చిత్రాలు చేసింది. కానీ పెద్దగా గుర్తింపు రాలేదు. అందుకే సరైన సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న ఈ ముద్దుగుమ్మకు ఈ చిత్రాలు మంచి విజయాన్ని అందించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# ప్రిన్సెస్ ఆఫ్ టాలీవుడ్ స్టన్నింగ్ లుక్



సూపర్ స్టార్ మహేష్ బాబు గారాల పట్టి సితార ఘట్టమనేనికి తాజా ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఈ ఫోటోషూట్ లో అంతర్జాతీయ జువెలరీ బ్రాండ్ పీఎంజే కు సితార ప్రమోషన్ చేస్తోంది. ఇక వేదికపై సితార ఘట్టమనేని గ్లింప్స్ చూపరుల దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. సితార వయసు కేవలం 13. ఇంత చిన్న వయసులో అంతర్జాతీయంగా వేవ్స్ క్రియేట్ చేస్తోందనే చెప్పాలి. మిరుమిట్లు గొలిపే డిజైనర్ దుస్తుల్లో మహేష్ గారాల పట్టీ సితార ఘట్టమనేని ఎంతో క్యూట్ గా, అందంగా కనిపిస్తోంది. తాజాగా విడుదలైన ప్రకటన వీడియోలో సితార అచ్చం ఒక ప్రొఫెషనల్ మోడల్ లాగా గొప్ప ఆత్మవిశ్వాసంతో కనిపించడం హైలైట్. అలా ఠీవిగా కెమెరా ముందు నిలుచున్న తీరు, కళ్లతోనే కోటి భావాలు పలికిస్తూ, అందంగా స్టైలిస్తూ ఒక ప్రొఫెషనల్ మోడల్ నే తలపించింది. భవిష్యత్ లో గొప్ప స్టార్ అయ్యే లక్షణాలు సితారలో కనిపిస్తున్నాయని ఈ లుక్ చూడగానే ఘట్టమనేని అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అందం, స్టైల్, ఎలివేషన్ పరంగా తన తండ్రికి తగ్గ వారసురాలు అంటూ కితాబిచ్చేస్తున్నారు. సితారకు ఇప్పటికే ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉంది. ఇంతకుముందు న్యూయార్క్ లోని -టైమ్స్ స్క్వేర్- బిల్ బోర్డ్ పై మెరిసిన అతి పిన్న వయస్కురాలిగా సితార రికార్డు సృష్టించింది. ఇక సితార లుక్ చూడగానే అచ్చం తన తండ్రిని తలపిస్తోందని చాలా మంది అభిమానులు కితాబచ్చేస్తున్నారు. ప్రిన్సెస్ ఆఫ్ టాలీవుడ్ అంటూ అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సితార చాలా చిన్న వయసులో మోడలింగ్ ద్వారా ఆర్జించిన 1 కోటి రూపాయల తొలి పారితోషికాన్ని తన తండ్రి చారిటీ కార్యక్రమాలకు డొనేట్ చేసేయడం నిజంగా ఆశ్చర్యపరిచింది. దీనిని చిన్నారుల గుండె ఆపరేషన్లకు ఖర్చు చేస్తున్నారు. మహేష్ తరహాలోనే సామాజిక సేవలో తాను సైతం అంటూ సితార ముందుకు వస్తోంది. తన జిజ్ఞాస అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. నమ్రతా శిరోద్కర్ తన కుమార్తె కెరీర్‌ను చాలా పక్కాగా ప్లాన్ చేస్తూ తన ప్రతిభను నెమ్మదిగా ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. సితార టాప్ మోడల్ గానే కాదు.. ఇండియా బెస్ట్ హీరోయిన్ గా ఎదిగేందుకు ఛాన్సుందని ఇప్పుడు అభిమానులు ఊహాగానాలు సాగిస్తున్నారు. సితార ఘట్టమనేని ప్రస్తుతం ఇంకా స్కూల్ కిడ్. క్లాసికల్ డ్యాన్స్ కూచిపూడి, భరతనాట్యంలోను శిక్షణ పొందుతోంది. ఇప్పటికే పలు వేదికలపై తన ప్రదర్శనతో ఆకట్టుకుంది. నటనలో అవసరమైన శిక్షణను నమ్రత స్వయంగా ఇస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# భర్తకు 10,000 కోట్ల సామ్రాజ్యం నటికి సొంతంగా 200కోట్ల ఆస్తులు!



కెరీర్‌లో ఎన్నో విలక్షణమైన సినిమాల్లో నటించిన ప్రముఖ హీరోయిన్ హిందీ చిత్రసీమలో గొప్ప పెర్ఫామర్ గా గుర్తింపు తెచ్చుకుంది. క్వీన్ అని పిలుపు అందుకుంది. ప్రముఖ దర్శకనిర్మాత సినిమాల్లో నటించేప్పుడే అతడితో ప్రేమలో పడింది. ఆ ఇద్దరి ఎఫైర్ గురించి మీడియా కోడై కూసింది. పెళ్లయినవాడితో ఈ కులుకు లేంటి? అంటూ చాలా విమర్శలువచ్చాయి. అయినా చివరికి ఆ ఇద్దరూ ఒకటయ్యారు. అప్పటికి భార్యతో ఉన్న మనస్పర్థల కారణంగా అతడు ఈ హీరోయిన్ కి దగ్గరయ్యాడని ప్రచారం ఉంది. ఈ జంటకు ఇప్పుడు 10ఏళ్ల వయసున్న కుమార్తె (అదీరా చోప్రా) కూడా ఉంది. అప్పటికే పెళ్లయిన దర్శకనిర్మాతను పెళ్లాడిన ఈ ప్రముఖ నటి చాలా అవమానాలను ఎదుర్కొంది. కానీ ఇప్పుడు 200కోట్ల ఆస్తులను కూడగట్టడం చర్చనీయాంశమైంది.దాదాపు మూడు దశాబ్దాల సుదీర్ఘమైన సినీప్రస్థానంలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో అలరించిన సదరు హీరోయిన్ ఇటీవల సెకండ్ ఇన్నింగ్స్ లోను తనదైన ట్రేడ్ మార్క్ నటనతో మరోసారి ప్రజల్ని, అభిమానులను రంజింపజేస్తోంది. ఈ నటి మరెవరో కాదు.. ప్రముఖ దర్శకనిర్మాత ఆదిత్యా చోప్రాను పెళ్లాడిన రాణీ ముఖర్జీ. ప్రస్తుతం రాణీజీ నికర ఆస్తి విలువ 200 కోట్లు. సెకండ్ ఇన్నింగ్స్ లోను క్వీన్ అదరగొట్టేస్తున్నారు. తాను నటించే ఒక్కో సినిమాకి ఏకంగా 7 కోట్లు అందుకుంటూ నిరంతరం వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవలే విడుదలైన మార్ధానీ 3 కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇందులో ఒక ఇన్వెస్టిగేటివ్ పోలీసాఫీసర్ గా రాణీజీ పవర్ ఫుల్ నటనకు ప్రశంసలు కురుస్తున్నాయి. రాణి ముఖర్జీ పోలీస్ పాత్ర శివాని శివాజీ రాయ్ గా జీవించిందని ప్రశంసలు వచ్చాయి. ఈ సినిమా 30 జనవరి 2026న థియేటర్లలో విడుదలైంది. ఇందులో తన పాత్ర కోసం రూ.7 కోట్లు రెమ్యునరేషన్ తీసుకున్నట్లు సమాచారం. ఆసక్తికరంగా ఈ చిత్రంతో రాణి ముఖర్జీ భారతీయ సినీ పరిశ్రమలో 30 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. రాణీ 1996లో -రాజా కి ఆయేగి బారాత్-తో కెరీర్ ప్రారంభించింది. రాణీ ముఖర్జీ ఒక ఏడాదికి సినిమాలతో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల ద్వారా సుమారు రూ.20 కోట్లు సంపాదిస్తున్నారు. తాజాలెక్కల ప్రకారం రాణి ముఖర్జీ నికర ఆస్తి విలువ దాదాపు రూ.200 కోట్లు పైనే ఉంటుందని అంచనా. తన విలాసవంతమైన ఆస్తుల వివరాల్లోకి వెళితే.. ముంబైలోని జుహులో సీఫేసింగ్ అపార్ట్‌మెంట్ విలువ సుమారు 20- 30 కోట్ల మధ్య ఉంటుందని అంచనా. ఖండాలాలో ఫామ్ హౌస్ విలువ రూ.9 కోట్లు. తన కార్ గ్యారేజీలో మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ ఉన్నాయి. సుమారు 2.4 కోట్ల విలువైన రేంజ్ రోవర్ వోగ్ కూడా ఉంది. రాణి ముఖర్జీ తన వైవిధ్యమైన నటనతో జనహృదయాలను గెలుచుకుంటూనే ఉంది. 2025లో -మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే- చిత్రంలోనటనకు ఉత్తమ నటిగాజాతీయ అవార్డు అందుకున్నారు. ఇప్పుడు మర్ధానీ 3తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు.

# కృతికి ఈసారైనా కలిసొస్తుందా?



కృతి శెట్టి. తెలుగు ఆడియన్స్ కు ఈ పేరు తెలియని వారుండరు. ఉప్పెన సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కృతి శెట్టి మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ ను అందుకున్నారు. ఉప్పెన హిట్ తో కృతికి మంచి క్రేజ్ ఏర్పడింది. ఆ క్రేజ్ తోనే అమ్మడికి మంచి అవకాశాలు కూడా వచ్చాయి. ఉప్పెన తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలు మంచి ఫలితాల్నే ఇచ్చాయి. వరుస ఫ్లాపులతో తెలుగులో తగ్గిన అవకాశాలు కానీ ఆ తర్వాత కృతి చేసిన సినిమాలన్నీ వరుసగా నిరాశ పరుస్తూ వచ్చాయి. మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, ది వారియర్, కస్టడీ, మనమే ఇలా ఆమె చేసిన సినిమాలన్నీ ఒకదాన్ని మించి ఒకటి ఫ్లాపులుగా నిలవడంతో క్రమంగా కృతికి తెలుగులో అవకాశాలు కూడా తగ్గుముఖం పట్టాయి. శర్వానంద్ తో చేసిన మనమే సినిమానే కృతి తెలుగులో చేసిన ఆఖరి సినిమా. వేరే భాషలపై కృతి ఫోకస్ తెలుగులో అవకాశాలు తగ్గడంతో కృతి వేరే భాషలపై ఫోకస్ చేసింది. అందులో భాగంగానే తమిళంలో ఓ రెండు సినిమాలకు సైన్ చేసింది. అనుకున్నట్టే తమిళంలో కృతికి మంచి అవకాశాలే వచ్చాయి. కార్తీ హీరోగా వా వాతియార్ చేయగా, ఎన్నో వాయిదాల తర్వాత రీసెంట్ గా పొంగల్ కు ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్డ్ రెస్పాన్స్ ను తెచ్చుకుంది. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీలో హీరోయిన్ గా ఛాన్స్ వా వాతియార్ కాకుండా కృతి చేతిలోలవ్ఇన్సూరెన్స్ కంపెనీ అనే సినిమా కూడా ఉంది. కోలీవుడ్ యూత్ స్టార్ ప్రదీప్ రంగనాథ్ హీరోగా విఘ్నేష్ శివన్ దర్శ కత్వంలో ఈ సినిమా తెరకెక్కు తుంది. ప్రదీప్ సిని మాలకు యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. పైగా అతను చేసే సినిమాల్లో నటించే హీరోయిన్లకు కూడా మంచి క్రేజ్ ఏర్పడుతుంది.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in